క్లుప్తంగా

వైద్య సేవలు అభినందనీయం


రోగులకు చికిత్స చేస్తున్న వైద్యులు

మహేశ్వరం: గ్రామీణ ప్రాంతాల్లో అవేర్ సంస్థ ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మహేశ్వరం సీఐ ముని అన్నారు. సోమవారం మండల పరిధి తుమ్మలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవేర్ సంస్థ ఆధ్వర్యంలో కామినేని ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచితంగా పలువురికి వైద్య సేవలు అందించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు. నిత్యం వాకింగ్, యోగ, ధ్యానం, వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఇందులో సంస్థ మేనేజర్ వరుణ్, కార్యనిర్వాహక అధికారి వెంకన్న, పంచాయతీ కార్యదర్శి నరేందర్, వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుల సంఘాలతో అందెల భేటీ


మాట్లాడుతున్న అందెల శ్రీరాములు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో పలు కుల సంఘాల సభ్యులతో బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం బాలాపూర్ బస్తీల్లో కలియ తిరిగి కమలం పువ్వు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగార్జునబాబు, వెంకట్‌రెడ్డి, నరేశ్, రంగనాథ్, కురుమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


మన్నాన్ (ఫైల్)

పహాడీషరీఫ్: వ్యక్తి అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాదీ ముస్తఫా బస్తీకి చెందిన అబ్దుల్ మన్నాన్ (45) మీర్‌చౌక్‌లో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 20వ తేదీన పని నిమిత్తం వెళ్లిన అతను తిరిగి రాలేదు. అతని సెల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ కావడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. బంధువులు, స్నేహితుల వద్ద అబ్దుల్ ఆచూకీ కోసం వెతికారు. అయినా జాడ తెలియలేదు. దీంతో అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గానీ, 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

వివాదాస్పదంగా భవన శంకుస్థాపన

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని పిగ్లీపూర్ గ్రామంలో సోమవారం యాదవ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం వివాదంగా మారింది. భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తుండగా.. స్థానిక సర్పంచ్ కోటా రాధ, ఆమె భర్త లక్ష్మారెడ్డి, అతని సోదరులు యాదిరెడ్డి, సాగర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి భూమి పూజను అడ్డుకున్నారు. భవన నిర్మాణం చేస్తున్న భూమి తమదేనని, తమ భూమిలో భవనం ఎలా నిర్మిస్తారని కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. దీంతో ఆధారాలు చూపించాలని యాదవ సంఘం సభ్యులు ప్రశ్నించడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. లక్ష్మారెడ్డి అతని సోదరులు శంకుస్థాపనను అడ్డుకోవడంతో పాటు తమను బెదిరించారని యాదవ సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మారెడ్డి, అతని సోదరులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఇబ్రహీంపట్నం: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి బంగారాన్ని ఎత్తుకెళ్లారు. పట్టణంలోని మంచాల రోడ్డులో పాల్వ సరిత, మహేందర్ ఇంట్లోనే బ్యాంగిల్ స్టోర్, లేడీస్ కార్నర్ నడుపుతున్నారు. అయితే ఆదివారం ఇంటికి తాళం వేసి చెరువుగట్టుకు కుటుంబంతో సహా వెళ్లారు. దీనిని గమనించి దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లో నాలుగున్నర తులాల బంగారాన్ని దోచుకెళ్లారు. కుటుంబసభ్యులు సోమవారం తిరిగి రావడంతో చోరీ విషయం బయటకు వచ్చింది. మహేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు చెప్పారు.

నగదు పట్టివేత

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ ఔటర్ రింగ్ రోడ్డు చెక్‌పోస్ట్ వద్ద సోమవారం పోలీసులు రూ. 4.50లక్షల నగదును పట్టుకున్నారు. సంతోశ్ అనే వ్యక్తి హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తుండగా అతడి వాహనాన్ని తనిఖీ చేశారు. కారులో నగదును గుర్తించిన పోలీసులు డబ్బును స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి వాహనదారుడి వద్ద ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ మన్మోహన్ తెలిపారు.

బీఆర్‌ఎస్ విజయం తథ్యం

- మంత్రి సబితారెడ్డిని ఆదరించాలి
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు
- కారెక్కిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు


కందుకూరు: జైత్వారంలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ జంగారెడ్డి తదితరులు

కందుకూరు: నియోజకవర్గంలో మంత్రి సబితారెడ్డి విజయం ఖాయమని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ధీమా వ్యక్తంచేశారు. సోమవారం మండల పరిధి జైత్వారంలో సర్పంచ్ సదాలక్ష్మి, గ్రామ శాఖ అధ్యక్షుడు బక్క రాజు, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన బైరు జైపాల్‌రెడ్డి, చల్లా శ్రీపాల్‌రెడ్డి తదితరులకు గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే సబితారెడ్డి గెలిస్తేనే అది సాధ్యమన్నారు. ఇందులో పార్టీ ఎస్టీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు లచ్చానాయక్, చిర్ర సాయిలు, డైరెక్టర్ ఆనంద్, మాజీ సర్పంచ్ పర్వతాలుయాదవ్, ఢిల్లీ శ్రీధర్, శ్రీశైలం, జైపాల్, శేరిగూడెం రాజు, శ్రీపాల్‌రెడ్డి, ఓర్సు శంకర్, భూపాల్‌రెడ్డి, మహేందర్, చల్లా శ్రీధర్‌రెడ్డి, నరసింహ ఉన్నారు.

కొత్తగూడలో..

తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్ పార్టీ గెలవాలని, ముఖ్యంగా నియోజకవర్గంలో మంత్రి సబితారెడ్డిని గెలిపించాలని నాయకులు కోరారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా వారు కొత్తగూడలో పర్యటించి, సబితారెడ్డి ఆదరించాలని ప్రజలకు కోరారు. ఇందులో ఆ పార్టీ మండల అధ్యక్షుడు జయేందర్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదయ్య, యూత్ అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ దీక్షిత్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు యాదయ్య, నాయకులు సదానంద్‌గౌడ్, పాండు రంగారెడ్డి, జంగయ్య, దేవేందర్, వెంకటేశ్‌గౌడ్, ఎండీ అంజద్, లక్ష్మణాచారి, రాములు, మైసయ్య, జంగయ్య, ఎండీ అజ్జు, శంకర్, హన్మంత్, ఖలీల్, యాదిరెడ్డి, దేవమ్మ ఉన్నారు.


బడంగ్‌పేటలో కార్పొరేటర్ల ప్రచారం

కేసీఆర్ బాటలో సబితారెడ్డి..

బడంగ్‌పేట్: బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ బాటలో మంత్రి సబితారెడ్డి పయనిస్తున్నారని, బడంగ్‌పేట అభివృద్ధికి పాటుపడుతున్నారని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, నాయకులు అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా కార్పొరేషన్ పరిధి ఓల్డ్ విలేజ్‌లో పర్యటించారు. సీఎం కేసీఆర్, మంత్రి సబితారెడ్డి.. ఇంటికి పెద్ద దిక్కుగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, మరోసారి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఇందులో కార్పొరేటర్లు శ్రీనివాస్‌రెడ్డి, అర్జున్, నాయకులు ఆనంద్‌రెడ్డి, శ్రీనివాస్‌రాజు, సింహారెడ్డి, జంగారెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు సంతోష్, మహేందర్‌రెడ్డి, డానియల్ ఉన్నారు.

మంత్రి గెలుపే లక్ష్యంగా..


పార్టీలో చేరిన వారితో కార్తీక్‌రెడ్డి

కందుకూరు: మండల పరిధి పులిమామిడి, నేదునూరు గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి సమక్షంలో సోమవారం అధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి ఆయన ఆహ్వానించి మాట్లాడారు. మంత్రి సబితారెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వారికి సూచించారు. ఇందులో మైనార్టీ నియోజకవర్గ నాయకుడు ఎండీ దావూద్, మీనాజ్ పటేల్, మైనార్టీ మండల అధ్యక్షుడు ఎండీ అలీ, పులిమామిడి మజీద్ అధ్యక్షుడు ఎండీ జహంగీర్, బీఆర్‌ఎస్ నేదునూరు యూత్ అధ్యక్షుడు ఎండీ అఫ్సర్, మజీద్ అధ్యక్షుడు నవాబ్, మహ్మద్ రషీద్, ఎండీ జావీద్, ఎండీ అన్వర్, ఎండీ నయీమ్, అబ్దుల్ లతీఫ్, మున్వర్ ఉన్నారు.

మంత్రిని గెలిపించాలి

- విద్యాభివృద్ధికి పాటుపడిన సబితారెడ్డి
- ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా


సరూర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం నియోజకవర్గం నుంచి మంత్రి సబితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సరూర్‌నగర్‌లోని హుడాకాలనీ, అంబేడ్కర్ నగర్, పంజాల అనిల్‌కుమార్ కాలనీలో బీఆర్‌ఎస్ నాయకులతో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, బీఆర్‌ఎస్‌ను మరోసారి ఆదరించాలని కోరారు. నియోజకవర్గంలో మంత్రి సబితారెడ్డి వందలాది ఐటీ కంపెనీలను తేవడంతో పాటు మెడికల్ కళాశాల, రెండు డిగ్రీ, జూనియర్ కళాశాలలు, మహిళా పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి పాటుపడ్డారని తెలిపారు. ఇందులో నాయకులు బాలకిషన్, అనితారెడ్డి, అంకిరెడ్డి, మొహమ్మద్ సలీం, రాజేశ్‌గౌడ్, నాగమణి, సాలమ్మ, శృతి, సుదర్శన్, విజయేందర్, వినయ్‌చారీ, ప్రత్యూష పాల్గొన్నారు.

సబితారెడ్డిని ఓడించండి

- అవినీతి పాలనను అంతం చేయండి
- కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్‌ఆర్


సమావేశంలో మాట్లాడుతున్న కేఎల్‌ఆర్

తుక్కుగూడ: అవినీతి, కుటుంబ పాలనను తరిమికొట్టాలని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి (కేఎల్‌ఆర్) పిలుపునిచ్చారు. సోమవారం తుక్కుగూడలో కాంగ్రెస్ నియోజకవర్గ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేఎల్‌ఆర్ మాట్లాడుతూ మంత్రి సబితారెడ్డిని ఓడించాలని కోరారు. అభివృద్ధి పేరుతో నియోజకవర్గ ప్రజలను ఆమె మోసం చేశారని మండిపడ్డారు. అధిష్టానం సూచన మేరకు తాను ఈ నియోజకవర్గంలో పోటీ చేస్తున్నానని తెలిపారు. తన గెలుపునకు కాంగ్రెస్ శ్రేణులు సహకరించాలని అభ్యర్థించారు. అధినేత సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, అమరేందర్‌రెడ్డి, జానకీరామ్, ఈశ్వర్, కృష్ణానాయక్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వారి డిపాజిట్లు గల్లంతు ఖాయం

- అభివృద్ధి నిరోధకులకు గుణపాఠం చెప్పాలి
- బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం
- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


ప్రజలతో మాట్లాడుతున్న జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతుకానున్నాయని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి నిరోధకులుగా మారిన ఆ పార్టీ నాయకులకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామంలో సోమవారం బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి జైపాల్‌యాదవ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాధించిన విజయాలు, కల్వకుర్తి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తోందని, ఇక్కడ అమలవుతున్న సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలో లేవని గుర్తుచేశారు. సంక్షేమ పాలన అందిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించానని, మరోసారి తనకు అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, జెడ్పీటీసీ అనురాధ, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు కుమార్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, కోనాపూర్ ఎంపీటీసీ సరిత పంతునాయక్, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ కారణజన్ముడు

తలకొండపల్లి: సీఎం కేసీఆర్ కారణజన్ముడని ఎమ్మెల్యే జపాల్‌యాదవ్ కొనియాడారు. సోమవారం మండలంలోని చుక్కాపూర్, యడవల్లి గ్రామాల్లో కల్వకుర్తి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఫుడ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, గోలి శ్రీనివాసురెడ్డి, మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం కలిసి ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం చుక్కాపూర్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీలో పదవులు అనుభవించి వెన్నుపోటు పొడిచిన ఓ నాయకుడు ఇటీవల కాంగ్రెస్‌లో చేరాడని, అలాంటి ద్రోహులకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కేసీఆర్‌తోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. 76 ఏళ్లలో రాష్ట్రంలో జరగని అభివృద్ధి సీఎం కేసీఆర్ 9 ఏళ్లలో చేసి చూపించారని తెలిపారు. బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాసురెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు నర్సింహ, జెడ్పీకో ఆప్షన్ సభ్యుడు రహ్మాన్, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ ఉన్నారు.

కారు.. జోరు

ఇబ్రహీంపట్నం: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు, శ్రేణులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ఊరువాడ అభ్యర్థులను అభ్యర్థిస్తున్నారు. సోమవారం ఇబ్రహీంపట్నంలోని పలు వార్డుల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, బీఆర్‌ఎస్వీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రాజు, కౌన్సిలర్లు బాలరాజ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, కంచకట్ల భాస్కర్ ఇంటింటికీ వెళ్లి ఓటర్లను వేడుకుంటున్నారు. కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులు, సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు, బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను వివరిస్తూ ప్రచారం చేశారు.

బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయం

తుర్కయంజాల్: సోమవారం తుర్కయంజాల్‌లో ఇంటింటికీ ప్రచారం నిర్వహించి, బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోను వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ హ్యాట్రిక్ ఖాయమని బ్రాహ్మణపల్లి కౌన్సిలర్ మల్లేశ్, రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ శ్రీను ధీమా వ్యక్తం చేశారు. ఇందులో నాయకులు సంపతీశ్వర్ రెడ్డి, ఐలయ్య ఉన్నారు.

పెరిగిన పోలింగ్ స్టేషన్లు

- 1,500 ఓట్లు మించితే మరో కేంద్రం
- 542కు చేరిన సంఖ్య



మహేశ్వరం నియోజకవర్గం ముఖ చిత్రం

మహేశ్వరం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. గత ఎన్నికల సమయంలో 511 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 542 చేరింది. 31 పోలింగ్ కేంద్రాలు అదనంగా ఏర్పాటు చేశారు.

1,500 ఓట్లకు మించితే..

సాధారణంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో 1500 లోపే ఓటర్లు ఉండగా.. కొత్త ఓటర్ల నమోదుతో ఆ సంఖ్య పెరిగింది. అంతే కాకుండా పోలింగ్ కేంద్రాల మధ్య దూరం ఉండటం వంటి కారణాలతో మరిన్ని కేంద్రాల ఏర్పాటు అనివార్యమైంది. ఈ క్రమంలోనే నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరిగింది. ఇదిలా ఉండగా ఈ నెల 31 వరకు ఓటు హక్కు నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం గడువు ఇచ్చిన నేపథ్యంలో ఇంకా ఓటర్లు పెరిగే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు.

అందుబాటులో సహాయ కేంద్రాలు

ఓటర్లు తమ పోలింగ్ స్టేషన్లను గుర్తించడంలో ఇబ్బందులు తలెత్తకుండా.. ఆయా ప్రాంతాల కేంద్రాల్లో పోలింగ్ స్టేషన్ల నంబర్లు, ఆ పోలింగ్ స్టేషన్ పరిధిలో మ్యాపులు, ఫొటోలు, పూర్తి సమాచారంతో ఉన్న ఓటర్ల జాబితాను అతికించారు. దీంతో పాటు కొత్తగా ఓటర్ అసిస్టెన్స్ బూత్‌ల ఏర్పాటుకు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఓటరు జాబితాలతో సహా బీఎల్‌ఓలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంది. ఎవరైనా తమ ఓటు వివరాలు చెప్పాలని బీఎల్‌ఓలను కోరితే వారిని గైడ్ చేసేలా చర్యలు చేపట్టనున్నారు. అంతే కాకుండా కొత్త ఓటర్ల నమోదు వలన ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1500కు పైబడి ఓటర్లు నమోదైతే కొత్త కేంద్రాలను ఏర్పాటు చేసే వీలులేక పోవడంతో ఆయా కేంద్రాల్లోనే ఓ పక్కన ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు.

ఓటర్లు ఎక్కువగా ఉంటే.. కొత్త కేంద్రం



గతంకంటే ప్రస్తుతం 31 కేంద్రాలు పెరిగాయి. ఒక్కో కేంద్రంలో 1500 ఓటర్ల కంటే ఎక్కువగా ఉంటే, మరో పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తాం. ఓటింగ్ నమోదుకు ఎన్నికల శాఖ అధికారులు అవకాశం కల్పించడంతో సుమారు 25 వేల మంది కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకున్నారు. అర్హత కలిగిన వారు ఇంకా ఉంటే ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి కేంద్రం సందర్శించి, ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– సూరజ్‌కుమార్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మహేశ్వరం నియోజకవర్గం

ఆచారిని గెలిపించండి

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి కోసం బీజేపీ అభ్యర్థి ఆచారిని గెలిపించాలని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు శేఖర్ కోరారు. శాంతినగర్ కాలనీలో సోమవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అనంతరం కాలనీలో ఆచారీకి మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజాసమస్యల పరిష్కారానికి బీజేపీ అనేక ఉద్యమాలు చేపట్టిందని గుర్తుచేశారు. ఆచారి ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజల మధ్యే ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నారని తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని అభ్యర్థించారు.

సామాన్యుడికి ‘కోడ్’ అవస్థలు


మాల్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

యాచారం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు చేపడుతున్న తనిఖీల్లో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. వైద్యం, చదువుల కోసం ఫీజులు, శుభకార్యాలు, వ్యాపారలావాదేవీలతో పాటు ఇతర పనుల కోసం సామాన్యులు నగదును తీసుకెళ్లేందుకు భయపడుతున్నారు. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై మాల్‌లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి చెక్‌పోస్టు ఏర్పాటు చేసి ముమ్మరంగా వాహనాలను చెక్ చేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రతి వాహనాన్ని తనిఖీలు చేయడం వలన వాహనాదారుల్లో గుబులు పట్టుకుంది. సాగర్ రోడ్డుపై మంగలిపల్లి, ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల పోలీసు లు వాహనాలను నిలిపి తనిఖీలు నిర్వహిస్తున్నారు. రూ.లక్షకు మంచి ఆన్‌లైన్‌లో లావాదేవీలు చేసినా.. సదరు ఖాతాదారుడి గురించి అధికారులు ఆరా తీస్తున్నారు. బ్యాంక్ ఖాతాలో డబ్బు ఉన్నా.. రూ. 50 వేలకు మించి డ్రా చేయలేని పరిస్థితి నెలకొంది.

ఆధారాలున్నా ఆగాల్సిందే..

నవంబర్ నెల మొదటి నుంచే శుభముహూర్తాలు ప్రారంభమవుతాయి. పెళ్లిళ్ల సీజన్ కావడంతో అవసరమైన ఆభరణాలు, బంగారం కొనుగోలు కోసం నగదును తీసుకెళ్లడం ఇబ్బందికరంగా మారింది. తులం బంగారం కొనాలంటే రూ.62వేలు అవసరం. పెళ్లికి ఐదు తులాల నుంచి పది తులాల వరకు బంగారం కొనుగోలు చేయాల్సి ఉంటుంది. రూ.లక్షల్లో నగదును తీసుకెళ్తే పోలీసులు ఎక్కడ పట్టుకుంటారోనని ఆందోళన చెందుతున్నారు. రూ.50వేల కన్నా ఎక్కువ తీసుకెళ్తే.. ఆ మొత్తానికి సంబంధించిన వివరాలు అధికారులకు తెలపాలి. లేకుండా నగదును సీజ్ చేసే అధికారం పోలీసులకు ఉంది. పక్కా ఆధారాలున్నా 24 గంటలు ఆగాల్సిందే. ఒకవేళ ఆ సమయంలో అధికారులు అందుబాటులో లేకపోతే ఆ కాష్టాలు తప్పవు. అవసరాల కోసం డబ్బు తీసుకెళ్తే ఎక్కడ పోలీసులకు పట్టుబడుతామోనని ఆందోళన చెందుతున్నారు.

వణుకుతున్న రియల్టర్లు

సామాన్యుడి పరిస్థితి ఇలా ఉంటే రియల్టర్లు మరింత జంకుతున్నారు. ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, ఆదిబట్ల తదితర మండలాల్లో ప్లాట్ల క్రయ, విక్రయాలు జరిపే వ్యాపారులు డబ్బుల తరలింపులో కఠిన నిబంధనలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లోని వ్యాపారులు నల్గొండ జిల్లా చింతపల్లి, మర్రిగూడ, దేవరకొండ, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట, కల్వకుర్తి తదితర ప్రాంతాల్లో వ్యవసాయ భూములు కొనుగోలుకు అగ్రిమెంట్లు చేసుకున్నారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు చేసుకునే గడువు వచ్చింది. గడువు మీరడంతో భూముల, ప్లాట్ల విక్రయదారులు డబ్బులిచ్చి రిజిస్ట్రేషన్లు చేసుకోండి, లేదంటే అదనంగా చెల్లించాల్సి వస్తుందని ఒత్తిడి పెంచుతున్నారు. ఎలాగైనా డబ్బులను మీరే తెచ్చి మా ఇంటి వద్ద ఇవ్వండి... ప్లాట్లు బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్లు చేసుకోండి... లేదంటే మీ ఇష్టం అంటు బెదిరింపులకు దిగుతున్నారు. కొనుగోలుదారులు కూడా రూ.లక్షల్లో డబ్బులు తీసుకెళ్తే ఎక్కడ పోలీసులు పట్టుకుంటారోనని, నగదు దొరికితే పట్టుకున్న తర్వాత ఏం సమాధానం చెప్పాలని మల్లగుల్లాలు పడుతున్నారు.

లబ్ధిదారుల ఎంపికలో ఏకపక్షం

- బీఆర్‌ఎస్ కార్యకర్తలకే అందుతున్న సంక్షేమ పథకాలు
- మండల సర్వసభ్య సమావేశంలో బీజేపీ సభ్యుల ఆరోపణ

మహేశ్వరం: సంక్షేమ పథకాల అమలులో బీఆర్‌ఎస్ ఏక పక్షంగా వ్యవహరించిందని, ఆ పార్టీ కార్యకర్తలకే అవి అందాయని బీజేపీకి చెందిన పలువురు సభ్యులు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి ఎంపీపీ రాత్లవత్ సునితా నాయక్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో బీజేపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పలు సమస్యలపై ధ్వజమెత్తారు. మన్సాన్‌పల్లిలో డబుల్ బెడ్ రూమ్‌ల పంపిణీలో ప్రతిపక్ష పార్టీ బీజేపీకి సమాచారం ఇవ్వకుండా బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులతో కలిసి అధికారులు పంపిణీ చేశారని ఆరోపించారు. నివాస స్థలాల పంపిణీ, దళితబంధు, బీసీబంధు పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ఏకపక్షంగా వ్యవహరించారని బీజేపీకి చెందిన సర్పంచ్‌లు మాసారం చంద్రయ్య గౌడ్, బుగ్గని శంకర్, రఘుపతి గౌడ్, మనోహర్, సురేష్, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్, సుదర్శన్ యాదవ్‌లు విమర్శించారు. అనంతరం సమావేశం నుంచి వాకౌట్ చేశారు. బీఆర్‌ఎస్‌కు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా.. అధికారులు వారికి సమాధానం ఇచ్చారు. సమావేశానికి సరైన సమాచారం, ఎజెండా లేకుండా అధికారులు వస్తున్నారని సభ్యులు పేర్కొనగా.. ఇక నుంచి అలా జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

అభివృద్ధికి కృషి

మండల అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నానని ఇన్‌చార్జి ఎంపీపీ సునితా నాయక్ అన్నారు. గ్రామాలు, తండాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారుల సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఇందులో ఎంపీడీఓ నర్సింహ, మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ సురసాని సురేందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నవత, డీఈలు, ఏఈలు, ఇతర శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీపీ సునితా నాయక్